సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 12 । నవంబర్ । 2024



రూ.1,00,116 విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహుని నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50,116, నిత్యాభిషేకానికి రూ.50 వేల చొప్పున ఆకుల త్రిమూర్తులు (అమలాపురం) విరాళం అందజేశారు.

సత్యదేవునికి ముత్యాల హారం



అన్నవరం: సత్యదేవునికి రూ.2 లక్షల విలువైన 20 గ్రాముల బంగారం, 29 గ్రాముల ముత్యాలతో చేయించిన హారాన్ని టి.అనిల్ కుమార్ (హైదరాబాద్) సమర్పించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 44,537 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 800, మధ్య డెల్టాకు వెయ్యి, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.50 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

అర్జీల పరిష్కారానికి చర్యలు



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో ట్రైనీ ఐఏఎస్‌లు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 144 అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ప్రతి ఒక్క అర్జీని 24 గంటల్లోగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి పది మంది ట్రైనీ ఐఏఎస్‌లు హాజరై, పరిపాలనాపరమైన అంశాలపై అవగాహన పెంచుకున్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 26 అర్జీలు




అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ నరసింహ కిషోర్


రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 26 అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా అర్జీదారులతో ఎస్పీ నరసింహ కిషోర్ నేరుగా మాట్లాడారు. వారి కష్టాలను, బాధలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి న్యాయం చేయాలని ఆదేశాలిచ్చారు. సివిల్, చీటింగ్, కొట్లాట, దొంగతనం కేసులతో పాటు కుటుంబ సమస్యలపై అర్జీలు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) అల్లూరి వెంకట సుబ్బరాజు, ఇన్‌స్పెక్టర్ (ఎస్‌బీ) శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి టి.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆజాద్ జయంత్యుత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు అధికారులు పుష్పాంజలి ఘటించారు. శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ 1948 నుంచి 1958 వరకూ పదేళ్ల పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ పనిచేశారన్నారు. దేశంలో అక్షరాస్యతకు ముఖ్యంగా బాలికల విద్యకు ఎంతో ప్రాధాన్యమిచ్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోతల బడ్జెట్!





- అన్ని రంగాల్లోనూ నిధులకు కత్తెర
- రైతులకు, మహిళలకు మరోసారి వంచన
- నిరుద్యోగ భృతి ఊసే లేదు
- కూటమి ప్రభుత్వ తొలి బడ్జెట్‌పై పెదవి విరుపు

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌పై సర్వత్రా పెదవి విరుపులే వినిపిస్తున్నాయి. శాసన సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ అన్యాయమే జరిగిందనే విమర్శ వస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం ఇలా అన్ని రంగాలకూ కోత విధించి తీరని అన్యాయం చేశారని పలువురు విమర్శిస్తున్నారు. ఇటు వార్షిక.. అటు వ్యవసాయ బడ్జెట్‌లో అన్నీ కోతలే విధించారు. ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన సూపర్–6కు అవసరమైన కేటాయింపులు సైతం చేయకపోవడం గమనార్హం. రైతులను, మహిళలను దారుణంగా మోసం చేశారని పలువురు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తొలిసారి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో ఎన్నికల హామీలు అమలు చేస్తుందని భావించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. ఈ బడ్జెట్‌పై మేధావులు, రైతు సంఘాల నేతలు పెదవి విరుస్తున్నారు. ఇంత దారుణమైన బడ్జెట్‌ను తాము ఎన్నడూ చూడలేదని నిట్టూరుస్తున్నారు. బడ్జెట్ కేటాయింపులపై బడుగు, బలహీన వర్గాల్లో సైతం వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పడం మానేసి.. గత ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కేందుకే సమయం కేటాయించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిరుద్యోగులకు దగా:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు. తాజా బడ్జెట్‌లో నిరుద్యోగుల ప్రస్తావనే లేకుండా వారికి నయా పైసా కూడా కేటాయించకుండా మరోసారి నిట్టనిలువునా మోసం చేశారు. జిల్లా వ్యాప్తంగా లక్షల మంది నిరుద్యోగులకు అన్యాయం చేశారు.

తల్లికి ద్రోహం

తల్లికి వందనం పేరుతో పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15,000 ఇస్తామన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం దారుణంగా కోత పెట్టారు. జిల్లావ్యాప్తంగా సుమారు 1.62 లక్షల మంది విద్యార్థులు పాఠశాలలకు వెళుతున్నారు. వీరికి గత ప్రభుత్వ హయాంలో ఏటా రూ.243 కోట్లు అందించేవారు. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులను బట్టి చూస్తే ఈ పథకంలో భారీగా కోత పడే అవకాశం కనిపిస్తోంది.

మహిళలకు మోసం

మహిళల అభ్యున్నతికి పాటుపడతామని ఎన్నికల వేళ చెప్పిన చంద్రబాబు.. బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం దారుణంగా మోసం చేశారు. 19 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18,000 ఇస్తామని చెప్పారు. కానీ, దీనికి బడ్జెట్‌లో కేటాయింపులే చేయలేదు. మహిళలకు ఉచిత బస్సు పథకంపై ఎటువంటి స్పష్టతా లేదు. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పగా, ఈ ఏడాది రెండు సిలిండర్లకు ఎగనామం పెట్టి ఇప్పటికే మోసం చేశారని మహిళలు విమర్శిస్తున్నారు.

రైతులకు పంగనామాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, బడ్జెట్‌లో మాత్రం అరకొర కేటాయింపులే చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలతో కలిపి ఇస్తామంటూ మెలిక పెట్టారు. జిల్లా వ్యాప్తంగా 1.22 లక్షల రైతు కుటుంబాలున్నాయి. అరకొర కేటాయింపులు చేయడంతో ఈ పథకం లబ్ధిదారుల్లో భారీగా కోత పెడతారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా రైతు భరోసా పథకం కింద రూ.90.55 కోట్లు చెల్లించేవారు.

సంక్షేమ రంగాన్ని విస్మరించారు



బడ్జెట్ అంటే గత ప్రభుత్వం హయాంలో జరిగిన తప్పులు వెతకడం కాదు. సంక్షేమ రంగానికి అత్యధిక నిధులు కేటాయించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు లేవు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు తగ్గించారు. అవసరమైన మేర కేటాయింపులు లేవు. కొత్త జిల్లాల అభివృద్ధికి నిధుల కేటాయింపులు జరగలేదు. అనేక పర్యాటక కేంద్రాలున్నా నిధులు విడుదల చేయలేదు. ముఖ్యమంత్రిని ఆర్థిక మంత్రి పొగడటం తప్ప బడ్జెట్‌లో కొత్తదనం లేదు.

– **తాటిపాక మధు**, సీపీఐ జిల్లా కార్యదర్శి

రైతుల మెడకు ఉరితాళ్లు



వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే రైతులకు ఉరితాళ్లు బిగిస్తున్నారంటూ గతంలో మండిపడిన చంద్రబాబు.. ప్రస్తుతం అవే మీటర్లు బిగించాలని నిర్ణయించడం దారుణం. బడ్జెట్‌లో రైతులకు తీరని అన్యాయం చేశారు. అన్నదాత సుఖీభవ, వడ్డీ లేని రుణాలకు కేటాయింపులు లేవు. పంటల బీమా రైతులే కట్టుకోవాలనడం దారుణం. ఉద్యాన పంటలకు కనీస మద్దతు ధర కల్పించే మార్కెటింగ్ సదుపాయాలపై ప్రకటన లేదు. ధాన్యానికి బోనస్ ఇవ్వడం లేదు.

– **కె.శ్రీనివాస్**, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

ప్రజలకు క్షమాపణ చెప్పాలి



గత ప్రభుత్వ హయాంలో రూ.14 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేశారు. ఏపీ మరో శ్రీలంక అయిపోతుందని ఆరోపించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నెలల వ్యవధిలోనే రూ.4 లక్షల కోట్లు అప్పు చేశారు. మాపై తప్పుడు ప్రచారం చేసిన టీడీపీ నేతలు, పచ్చ మీడియా ప్రజలకు క్షమాపణలు చెప్పాలి.

– **చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ**, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

ఆడబిడ్డలను వంచించారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డ నిధి పథకం ద్వారా 19 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు మహిళల బ్యాంక్ ఖాతాల్లో ప్రతి నెలా రూ.1,500 చొప్పున జమ చేస్తామని చెప్పి ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదు. రాష్ట్ర బడ్జెట్‌లో కూడా కేటాయింపులు లేకపోవడం దారుణం. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలకు అండగా ఉండటంతో పాటు ఆర్థికంగా తోడుగా నిలిచేందుకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 అందించారు. మహిళలను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి.

– **కాలాబత్తుల సుజాత**, జిల్లా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు, పందలపర్రు

ఎమర్జెన్సీని తలపిస్తున్న కూటమి పాలన

- ప్రభుత్వం చేసే తప్పులపై మాట్లాడితే నేరమా?
- ప్రభుత్వం ప్రజల వాక్ స్వాతంత్ర్యపు హక్కును హరిస్తోంది
- సోషల్ మీడియా వారియర్లకు న్యాయం జరుగుతుంది
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పాలన ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను తలపిస్తోందని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరం మార్గాని ఎస్టేట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. గతంలో రెడ్ బుక్ పట్టుకుని ఎవరినీ వదిలేది లేదని లోకేష్ ఎన్నో అవాకులు చవాకులు మాట్లాడలేదా.. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తాట తీస్తా, నార తీస్తా అనలేదా అని ప్రశ్నించారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామో లేక డిక్టేటర్‌షిప్‌లో ఉన్నామో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 2019లో ప్రజలు బ్రహ్మరథం పట్టారని, నాటి ఎన్నికల్లో తమ పార్టీకి 50 శాతం ఓట్లు వచ్చాయని గుర్తు చేశారు. అటువంటి నేతను సైకో జగన్ అంటూ ఎన్నోసార్లు మాట్లాడారని, దీనిపై ఎన్ని కేసులు పెట్టాలని ప్రశ్నించారు. అమ్మకు బడి.. నాన్నకు బుడ్డి, సైకో జగన్ అంటూ నోటికి వచ్చినట్లు మాట్లాడిన టీడీపీ నాయకులపై ఏ చర్య తీసుకోవాలని అన్నారు. టీడీపీ అఫీషియల్ పేజెస్‌లో గత ప్రభుత్వంపై అబద్ధపు రాతలు రాశారని గుర్తు చేశారు.

సాక్షాత్తూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లోనే ఎమ్మెల్యేలు బ్రాందీ షాపులపై పర్సెంటేజీలు తీసుకుంటున్నారంటూ ఆరోపించారని వివరించారు. జేసీ ప్రభాకరరెడ్డి బహిరంగంగానే వాటా అడిగారని, ఆయనపై ఏ చర్య తీసుకున్నారని ప్రశ్నించారు. ఉచిత ఇసుక ఎక్కడ దొరుకుతోందని మార్గాని ప్రశ్నించారు. సాక్షాత్తూ ఈనాడు పత్రికలోనే రోడ్ కం రైల్వే బ్రిడ్జి వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఇసుక దోపిడీ జరుగుతున్నట్లు రాశారని అన్నారు. ఎమ్మెల్యే సమక్షంలోనే దారుణంగా ఇసుక దోచేయటం లేదా అని ప్రశ్నించారు? ప్రజా సమస్యలపై గొంతెత్తుతూంటే కేసులు పెడుతున్నారని, ఎన్ని కేసులు పెడతారో పెట్టండని సవాల్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని భరత్‌రామ్ ప్రశ్నించారు. గతంలో జగన్ ప్రభుత్వం అమ్మ ఒడి పేరుతో తల్లుల ఖాతాలో డబ్బులు వేసేవారని, ప్రస్తుత ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి డబ్బులు ఇస్తామంటూ హామీ ఇచ్చి దానిని అమలు చేయడం లేదని అన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

సోషల్ మీడియాలో ప్రభుత్వంపై కామెంట్ చేసిన వారిని కేసులు పెట్టి వేధిస్తున్నారని వివరించారు. ఇంటూరి రవీంద్రను రాజమహేంద్రవరంలోని పోలీస్ స్టేషన్లో ఉంచారని, ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తే గొంతు నొక్కుతారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులను మరచిపోమని చెప్పారు. గతంలో సామాన్య రైతుగా ఉండే నందిగం సురేష్‌ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపీని చేశారని తెలిపారు. సోషల్ మీడియాపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతమని హెచ్చరించారు. సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేసి, ఏ కోర్టులో హాజరు పరుస్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. సోషల్ మీడియా వారియర్లకు న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం 4 లక్షల మంది వలంటీర్లను గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు.

అధికారం ఒకరి సొత్తు కాదని, ప్రతిదానికీ లెక్క ఉంటుందని మార్గాని హెచ్చరించారు. డ్రైనేజీ నీరు నేరుగా గోదావరిలో కలుస్తూంటే భక్తులు పుణ్యస్నానాలు ఎలా చేస్తారని ప్రశ్నించినందుకు తనపై రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో చేపల రాజు అనే వ్యక్తితో కేసు పెట్టించారని అన్నారు. ఎన్ని కేసులు పెడతారో చూస్తామని చెప్పారు. తాము ప్రజల పక్షాన నిలబడి గొంతుక విప్పుతామని అన్నారు. గత ఎన్నికల సమయంలో మూలగొయ్యి ప్రాంతంలో ఒక యువకుడిపై దాడి చేశారని, దీనికి సంబంధించిన వీడియోలు కూడా ఉన్నాయని, అయినప్పటికీ పోలీసుల నుంచి స్పందన లేదని అన్నారు. మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా లేక ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ పాలనలో ఉన్నామా అని ప్రశ్నించారు.

ఇసుక దోపిడీపై కన్నెర్ర

- ఉచిత ఇసుక అమలు తీరుపై భవన నిర్మాణ కార్మికుల మండిపాటు
- కూటమి విధానంతో నిర్మాణ రంగం కుదేలైందని ఆవేదన
- సామాన్యులకు ఇసుక అందుబాటులోకి తేవాలని డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం భవన నిర్మాణ రంగానికి శాపంగా మారింది. నిర్మాణ రంగంలో ప్రధానమైన ముడి సరకు ఇసుక. కూటమి ప్రభుత్వ విధానం పుణ్యమా అని.. పేరుకు ఉచితమే అయినా.. ఇసుక కోసం వస్తున్న వారిని అధికారం అండతో అక్రమార్కులు ఎక్కడికక్కడ నిలువు దోపిడీ చేస్తున్నారు. ముక్కుపిండి మరీ అధిక ధరలు వసూలు చేస్తున్నారు.



ధర్నా చేస్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు

ఒక యూనిట్ ఇసుకను రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారంటే ఇసుక దోపిడీ ఏ రీతిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో కంటే ఆఫ్‌లైన్‌లోనే ఇసుక విక్రయాలు అధికంగా జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం, అధికారులు చెబుతున్న మాటలకు, ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద పరిస్థితికి ఏమాత్రం పొంతన ఉండటం లేదు. పలు ర్యాంపుల్లో రాత్రి వేళ యథేచ్ఛగా ఇసుక తవ్వుతూ వందలాది లారీల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఫలితంగా ఇసుక అందుబాటులో లేకుండా పోవడంతో నిర్మాణ రంగం ఎక్కడికక్కడ కుదేలైంది. పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పులపాలై, అర్ధాకలితో, పస్తులతో, దుర్భర పరిస్థితుల్లో కాలం గడుపుతున్నారు. వీరితో పాటు ఈ రంగంపై పరోక్షంగా ఆధారపడి ఉన్న ప్లంబింగ్, ఎలక్ట్రికల్, సెంట్రింగ్, రాడ్ బెండింగ్, పెయింటింగ్ తదితర కార్మికులు కూడా ఉపాధి దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న ఊళ్లో పనులు లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో పలువురు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం తమకు ఈ దుస్థితి తీసుకుని వచ్చిందంటూ భవన నిర్మాణ కార్మికులు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమార్కులు కొద్ది నెలలుగా ఇసుక దోపిడీకి పాల్పడటం.. ఉచితం పేరుతో సామాన్యులకు ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడటంతో కడుపు మండిన భవన నిర్మాణ కార్మికులు సోమవారం ఆందోళనకు దిగారు. కూటమి ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వమే ఇసుక ర్యాంపులను నిర్వహించాలని, ఇసుకపై అన్ని రకాల పన్నులూ ఎత్తివేయాలని, ఇసుకాసురులను కఠినంగా శిక్షించాలని, ఇసుకను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని, నిర్మాణ రంగంలో వసూలు చేస్తున్న ఒక్క శాతం సెస్‌ను తమ సంక్షేమానికే ఉపయోగించాలని, సిమెంట్, ఇనుము వంటి గృహోపకరణాల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. తమ ఇబ్బందులు కలెక్టర్‌కు చెప్పుకుందామని ప్రయత్నించిన వారిని పోలీసులు కలెక్టరేట్ ప్రాంగణం బయటే నిలువరించారు. అటు ప్రభుత్వం వినక, ఇటు అధికారులు పట్టించుకోకపోతే తమ పరిస్థితి ఏమిటంటూ పలువురు భవన నిర్మాణ కార్మికులు ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దళారుల చేతుల్లో ఇసుక



కూటమి ప్రభుత్వ పాలనలో ఇసుక దళారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. వారు మాత్రమే ఇసుక అమ్ముకుంటున్నారు. కూటమి నాయకుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోంది. ఇసుక దోపిడీని అరికట్టనంత వరకూ భవన నిర్మాణ కార్మికులకు పనులుండవు.

– **తాటిపాక మధు**, జిల్లా గౌరవ అధ్యక్షుడు, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్

ఎన్నికల హామీలు అమలు చేయాలి



ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉచిత ఇసుక ఇస్తామని భవన నిర్మాణ రంగానికి ఆశలు చూపించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మమ్మల్ని పూర్తిగా ముంచేశారు. పేరుకే తప్ప ఉచిత ఇసుక ఆచరణలో అమలు కావడం లేదు. వేరేచోట నుంచి పెద్ద పెద్ద లారీలతో వచ్చి, ఇక్కడి ఇసుకను తరలించుకుపోతున్నారు.

– **పందేళ్ల భానుప్రసాద్**, జిల్లా అధ్యక్షుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం

దళారులను అరికట్టాలి



ఇసుకను దోచుకుంటున్న దళారులను అరికట్టాలి. స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. ఇసుక అధిక ధరలను నియంత్రించాలి. భవన నిర్మాణ కార్మికులకు, సామాన్య ప్రజలకు, ఇంజినీర్లకు, బిల్డర్లకు ఇసుక అందుబాటులోకి తీసుకురావాలి. అప్పుడే భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి దొరుకుతుంది.

– **కోల సురేష్**, కడియం

సంక్షేమ మండలి ఏర్పాటు చేయాలి



రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ మండలి ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.5 కోట్ల క్లెయిమ్ నిధులను తక్షణమే మంజూరు చేయాలి.

– **రామకృష్ణ**, శ్యామల సెంటర్, రాజమహేంద్రవరం

ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్



తీపర్రు ర్యాంప్‌లో పోలీసుల పర్యవేక్షణలో ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్



కానూరు - పెండ్యాల ఇసుక ర్యాంప్‌ను పరిశీలిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

- 'సాక్షి' కథనంతో కదిలిన అధికారులు
- ర్యాంపుల వద్ద పోలీసు పహారా

సాక్షి ఇంపాక్ట్

పెరవలి: 'ఉచితంగా దోపిడీ' శీర్షికన 'సాక్షి' సోమవారం సంచికలో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. కానూరు - పెండ్యాల, తీపర్రు ఇసుక ర్యాంపులలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ ర్యాంపుల్లో పహారాకు పోలీసులను నియమించారు. మరోవైపు తహసీల్దార్లు కూడా ఆయా ర్యాంప్‌లకు వెళ్లి, దగ్గరుండి ట్రాక్టర్లకు ఇసుక ఎగుమతి చేసేలా చర్యలు తీసుకున్నారు. గత్యంతరం లేకపోవడంతో కాంట్రాక్టర్లు ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్ చేశారు. తమ సమస్య పరిష్కారానికి తోడ్పడిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కొందరు డ్రైవర్లు 'సాక్షి'తో మాట్లాడుతూ, ఇప్పటి వరకూ కోనసీమ జిల్లా గోపాలపురం నుంచి ఇసుక తెచ్చుకుంటున్నామని, నేటితో ఆ ఇబ్బంది తొలగిందని చెప్పారు.

ఆగని అ'ధనపు' వసూళ్లు

కానూరు - పెండ్యాల, తీపర్రు, పందలపర్రు ఇసుక ర్యాంప్‌లలో అదనపు సొమ్ముల వసూళ్లు మాత్రం ఆగలేదు. నిన్నటి వరకూ ట్రాక్టర్‌కు రూ.750 వసూలు చేయగా, సోమవారం మాత్రం లారీలకు ఇసుక ఇవ్వకుండా కేవలం ట్రాక్టర్లకు ఎగుమతి చేసి, రూ.500 నుంచి రూ.వెయ్యి వరకూ దండుకున్నారు. వాస్తవానికి తీపర్రు ర్యాంప్‌లో టన్ను ఇసుక రూ.96.02 చొప్పున ఒక్కో ట్రాక్టర్‌కు 4 టన్నులకు రూ.385 మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా, రూ.600 వసూలు చేశారు. కానూరు - పెండ్యాల ర్యాంప్‌లో టన్నుకు రూ.68.96 చొప్పున ఒక్కో ట్రాక్టర్‌కు 4 టన్నులకు రూ.276 మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా రూ.వెయ్యి గుంజుతున్నారు. పందలపర్రు ర్యాంప్‌లో ఒక్కో ట్రాక్టర్ వద్ద రూ.500 వసూలు చేస్తున్నారు. కానూరు - పెండ్యాల ర్యాంప్‌లో ఇసుక లోడ్ చేసిన కూలీలకు రూ.500 ఇచ్చానని, ఏటిగట్టు దిగిన తరువాత బాట ఖర్చులంటూ మరో రూ.500 తీసుకున్నారని అజ్జరం గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి, వెళ్లడమే తప్ప, చర్యలూ తీసుకోకపోవడంతో కాంట్రాక్టర్లకు ఆడింది ఆట పాడింది పాటగా మారిందని వాహన యజమానులు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

బైక్‌ల చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

మామిడికుదురు: వ్యసనాలకు బానిసై బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేశామని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ సోమవారం తెలిపారు. జైలు నుంచి విడుదలై వచ్చి బైక్‌ల దొంగతనాలు చేస్తున్న అల్లవరం మండలం ఓడలరేవు గ్రామానికి చెందిన నల్లి బాలకృష్ణను అరెస్ట్ చేసి రాజోలు కోర్టుకు తరలించామని అన్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన బాలకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ల దొంగతనం ఘటనలు బయటపడ్డాయన్నారు. నగరం పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, పాలకొల్లు టౌన్ పరిధిలో ఒకటి చొప్పున బైక్‌లు చోరీ చేశాడన్నారు. ఆసుపత్రులు, ఖాళీ ప్రదేశాల్లో నిలిపిన వాహనాలను దొంగిలించేవాడన్నారు. రాజోలు పోలీస్ స్టేషన్‌లో 27 బైక్‌లు, అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 బైక్‌లు దొంగతనం చేసి గతంలో జైలుకు వెళ్లి వచ్చాడని ఎస్సై చైతన్యకుమార్ వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చోరీ కేసులో ఇద్దరు..



విలేకర్లకు వివరాలు తెలియజేస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: ఇటీవల వేట్లపాలెం గ్రామంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన ఇద్దరిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎ.కృష్ణభగవాన్ వెల్లడించారు. తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న కోనసీమ జిల్లాకు చెందిన జిల్లెల రాకేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, అదే జిల్లాకు చెందిన చావల కృష్ణ ఉన్నాడని చెప్పడంతో, ఇద్దరినీ అరెస్టు చేశామన్నారు. ఈ కేసును కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఛేదించామన్నారు. నిందితుల నుంచి 186.79 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందన్నారు. సమావేశంలో క్రైం సీఐ అంకబాబు, ఇతర సిబ్బంది ఉన్నారు.



మురమళ్ల వీరేశ్వర ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకం చేస్తున్న అర్చకుడు



గోదావరిలో కార్తిక దీపం వదులుతున్న మహిళ



రాజమహేంద్రవరంలో రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ముక్కంటి... ప్రణమిల్లె జగతి

ముల్లోకాలను ఏలే ఆ ముక్కంటికి భక్తజనం ప్రణమిల్లింది.. ఓం నమఃశివాయ నామస్మరణ ప్రతి నోటా వేదమంత్రమైంది.. ఆ సర్వేశ్వరునికి ప్రీతికరమైన కార్తిక మాసం, అందులోనూ సోమవారం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాల్లో రద్దీ నెలకొంది. ఆయా ఆలయాల వద్ద, గోదావరి ఘాట్‌లలో కార్తిక దీపాలను వెలిగిస్తూ మహిళలు కనిపించారు. అనంతరం ఆ స్వామిని దర్శించుకున్నారు. రాజమహేంద్రవరంలోని పలు ఆలయాలు, మురమళ్ల వీరేశ్వరస్వామి, పిఠాపురం, సామర్లకోటలో పంచారామ క్షేత్రాలు, ఇలా ప్రతి ఆలయంలోనూ భక్తులు కిక్కిరిశారు.



పాదగయలో కుక్కుటేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న పురోహితులు



రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానమాచరిస్తున్న భక్తజన సందోహం



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం బేడా మండపంలో అభిషేక పూజల్లో భక్తులు



పిఠాపురం పాదగయలో భక్తుల సందడి



పిఠాపురంలో కార్తిక దీపం చూపుతూ..

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

గండేపల్లి: విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆదిత్య విద్యా సంస్థల ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ అన్నారు. సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలను ముఖ్య అతిథులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ గతంలో క్రీడల్లో రాణించిన ఎందరో వివిధ రంగాల్లో మంచి స్థాయిలో స్థిరపడ్డారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారని, ఆదిత్య క్యాంపస్‌లో పదో సారి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జి.శ్యామ్‌కుమార్, అంతర్జాతీయ అథ్లెటిక్స్ పీపీ వరప్రసాద్, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ నాయకుడు సూకరాజు హాజరయ్యారు. డీన్ వి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి, ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం జరిగిన పోటీల్లో విజేతలకు సతీష్‌రెడ్డి బహుమతులు అందజేశారు.



బెలూన్స్ వదిలి పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

కాకినాడ సిటీ: పూర్వపు తూర్పు– పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల నియోజకవర్గ ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి సభ్యుని ఎన్నికకు చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సోమవారం తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఈ నెల 18వ తేదీ దాటకుండా సెలవు రోజుల్లో తప్ప ఏ రోజైనా, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య రిటర్నింగ్ అధికారి కలెక్టర్ కార్యాలయంలో అందించవచ్చన్నారు. దీనికి సంబంధించిన నామినేషన్ పత్రాలు కలెక్టరేట్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని ఈ నెల 19న ఉదయం 11 గంటల నుంచి కోర్టు హాలు, కలెక్టరేట్ వద్ద పరిశీలిస్తారన్నారు. 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చన్నారు. ఎన్నికకు పోటీ ఉంటే డిసెంబర్ 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పోలింగ్ జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బిక్కవోలు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవికుమార్ తెలిపారు. బలభద్రపురం గ్రామానికి చెందిన బుంగా రాజేష్ (32) గ్రాసిం ఇండస్ట్రీలో పని చేస్తున్నాడు. ఎప్పటికి లాగే ఆదివారం రాత్రి బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 11 గంటలు అవుతున్నా అతను రాకపోవడంతో భార్య ఝాన్సీరాణి ఫోన్ చేసింది. అతను బలభద్రపురం శివారులో పడి ఉన్నాడని తెలియడంతో వెంటనే తన కుటుంబ సభ్యులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లింది. గాయాలతో ఉన్న రాజేష్‌ను అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అయితే తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఝాన్సీరాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



మృతి చెందిన రాజేష్

లైంగిక దాడికి యత్నించిన నలుగురిపై కేసు

గోకవరం: మహిళపై లైంగిక దాడి యత్నించిన నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కృష్ణునిపాలెం సంజీవయ్యనగర్‌కు చెందిన మహిళ రాజమహేంద్రవరంలో పని చేస్తుంది. ఆదివారం రాత్రి పది గంటల సమయంలో రాజమహేంద్రవరం నుంచి గోకవరం వచ్చి కాలినడకన కృష్ణునిపాలెం వెళుతుండగా పెట్రోల్ బంకు ఎదురుగా షేక్ ఖన్నానజీర్ అనే యువకుడు దీపావళి సామాన్లు కాల్చుతున్నాడు. మహిళ ఒక్కరే నడిచి వెళ్లడాన్ని గుర్తించిన యువకుడు ఆమె నోరు నొక్కి లైంగిక దాడి చేయడానికి పెట్రోల్ బంకులోకి తీసుకు వెళ్లాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని యువకులు అక్కడకు చేరుకుని మహిళను రక్షించారు. అలాగే యువకుడిని పట్టుకోవడానికి ప్రయత్నించగా అతని స్నేహితులు ముగ్గురు అక్కడి నుంచి తీసుకు వెళ్లిపోయారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు యువకుడితో పాటు సదరు ముగ్గురు యువకులను సోమవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించారు. వీరు నలుగురు యువకులు రాజమహేంద్రవరంలో డిగ్రీ చదువుతున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆటల్లో సూపర్‌వైజర్

- రాణిస్తున్న అన్నవరం దేవస్థానం ఉద్యోగిని
- ఆలయ చైర్మన్, ఈఓ అభినందన



వల్లూరి మాధవి

అన్నవరం: సాధించాలనే తపన ఉంటే ఏదైనా సొంతం చేసుకోవచ్చు.. బాధ్యతలు ఉన్నా ఆశయాన్ని నెరవేర్చుకోవచ్చు.. అచ్చం అలానే అన్నవరం దేవస్థానం ఉద్యోగిని వల్లూరి మాధవి ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీల్లో షాట్‌పుట్, వాలీబాల్‌లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో ఢిల్లీలో జరిగే 2024–25 జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీల్లో పాల్గొననున్నారు. దేవదాయ శాఖ నుంచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ఏకైక క్రీడాకారిణి ఆమే కావడం విశేషం. ఆ వివరాల్లోకి వెళ్తే.. విద్యార్థి దశలోనే కాదు, ఉద్యోగిని అయ్యాక కూడా ఏ క్రీడలో పాల్గొన్నా పతకాలు సాధించిన ఘనత అన్నవరం దేవస్థానం వైద్యశాల ఫార్మసీ సూపర్‌వైజర్ వల్లూరి మాధవికు దక్కుతుంది. గతంలో జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకూ ఎన్నో క్రీడల్లో పాల్గొని ఆమె పతకాలు సాధించారు. ఈ నెల 6న గుంటూరు నాగార్జున యూనివర్సిటీ మైదానంలో జరిగిన అథ్లెటిక్స్ విభాగంలో షాట్‌పుట్ (45 ప్లస్ మహిళల విభాగం)లో ప్రథమ స్థానం పొందారు. ఈ నెల 9న విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన వాలీబాల్ మహిళల టీమ్‌లో విజేతగా నిలిచి జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడ ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ చదివేటప్పటి నుంచి మాధవి 1995లో దేవస్థానం ఫార్మాసిస్ట్‌గా ఉద్యోగం పొందినప్పటికీ ఉద్యోగినిగా, వివాహం అయ్యాక గృహిణిగా తన బాధ్యతలు నెరవేరుస్తూనే క్రీడా పోటీల్లో రాణిస్తున్నారు. గతంలో అనేక పోటీల్లో పాల్గొని పతకాలు సాధించినట్లు ఆమె సోమవారం విలేకర్లకు వివరించారు.



గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో షాట్‌పుట్ విసురుతున్న మాధవి

విజయ ప్రస్థానం ఇదీ..

- మాధవి విద్యార్థి దశలో సుమారు 30 సార్లు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఫార్మసీ విద్యార్థినిగా వాలీబాల్ జాతీయ పోటీల్లో వరుసగా 1991లో బరంపురం, 1992లో భూపాల్, 1993లో పాట్నాలో ఆడారు.
- 2015లో కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన 35వ మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌లో మూడు స్వర్ణ పతకాలు, అనంతరం ఒంగోలులో జరిగిన ఎన్జీఓ క్రీడా పోటీల్లో నాలుగు పతకాలు సాధించారు.
- 2017 మార్చిలో మైసూర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఎన్జీఓ క్రీడా పోటీలలో పాల్గొన్నారు. ఇంతవరకూ వివిధ పోటీల్లో పాల్గొని 60కి పైగా పతకాలు సాధించారు.
- 2018 జనవరి 7, 8, 9 తేదీల్లో గుంటూరులో జరిగిన 36వ ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ మీట్‌లో మూడు పతకాలు పొందారు. షాట్‌పుట్, జావెలిన్‌త్రోలో స్వర్ణ, డిస్క్‌త్రోలో రజత పతకాలు దక్కించుకున్నారు. జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపికైన ఆమెను అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ అభినందించారు.

లారీల ఢీ: డ్రైవర్ మృతి

దుద్దుకూరులో ఘటన



ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ అనంతరాజు



దుద్దుకూరు వద్ద రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి చెందిన డ్రైవర్ సరికొండ అనంతరాజు (50) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దుద్దుకూరు వద్ద ఫ్లై ఓవర్ దిగువలో రాజమహేంద్రవరం వైపు వెళుతున్న లారీ ముందు వెళుతున్న సెప్టిక్ ట్యాంకర్‌ను ఢీకొని సర్వీసు రోడ్డులోకి దూసుకు వెళ్లింది. అక్కడ టైర్ల దుకాణం వద్ద పంక్చర్ వేయించుకోవడానికి ఆగి ఉన్న ఐషర్ పార్సిల్ లారీని ఢీకొంది. దీంతో పార్సిల్ లారీ పక్కకు ఒరిగిపోగా, దీనిని ఢీకొన్న లారీ క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ అనంతరాజు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. అతన్ని బయటకు తీసేసరికి మృతి చెందినట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సెప్టిక్ ట్యాంకర్ అదుపుతప్పి పక్కకు వెళుతూ జియో ఖాళీ ట్యాంకర్‌ను ఢీకొనగా అది పాక్షికంగా దెబ్బతింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుబ్రహ్మణ్యం వివరించారు.